# విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 08 మే 2025 8 పేజీలు

## సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేద్దాం

సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయుట, సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా, ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ల పర్యవేక్షణలో బుధవారం ఒంగోలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, జిల్లాలో పలు ప్రదేశాలలో అగ్ని పేలుడు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

-విశాలాంధ్ర, ఒంగోలు

2లో

## ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర - మార్టూరు : ప్రజల సంక్షేమ కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఇంఛార్జి మంత్రి రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల,గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన నగదును బాధిత కుటుంబాలకు పర్చూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం చెక్కుల రూపంలో జిల్లా ఇంఛార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా అందజేశారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ఇంఛార్జి మంత్రి పార్థసారథి చెప్పారు.పర్చూరు నియోజకవర్గంలోని వివిధ కారణాలతో అనారోగ్యానికి గురైన 43 మంది బాధితులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి అభ్యర్థించారన్నారు. పర్చూరు ఎమ్మెల్యే సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్షణమే సీఎం సహాయ నిధి నుంచి రూ.28.85 లక్షల నిధులను విడుదల చేశారన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న వారంతా వెంటనే కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వారి కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ తొలగింపునకు రంగం సిద్ధం

- త్వరలో అవిశ్వాస తీర్మానం..!
- కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కందుల సమాలోచనలు

విశాలాంధ్ర - మార్కాపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ చిర్లం చర్ల బాలమురళీకృష్ణపై వేటు వేసేందుకు అధికార టిడిపి రంగం సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి చైర్మన్ పీఠాలను టిడిపి దక్కించుకుంటున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మార్కాపురం మున్సిపాలిటీని కూడా తమ ఖాతాలో వేసుకునేందుకు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ అంశంపై చర్చించేందుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లతో తన నివాసంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 35 వార్డులకు గాను కేవలం ఐదు వార్డుల్లో మాత్రమే టిడిపి విజయం సాధించగా, నాటి అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 30 స్థానాల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం జరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల

మిగతా 2 లో ...



## ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి

- పొగాకుకు గిట్టుబాటు ధర దక్కాలి
- సీఎం దృష్టికి వెళితేనే న్యాయం
- వ్యాపారులు, బోర్డు అధికారులు, రైతు నాయకులతో సమావేశం నిర్వహించాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయించాలి
- లేని పక్షంలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం
- ఎమ్మెల్యేలను కోరిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర -ఒంగోలు : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ కోరారు. ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రం ను బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ లతో కలిసి ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవి ప్రసాద్ పరిశీలించారు. పొగాకు రైతులతో వారు మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేవీవి ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపారులు, పొగాకు బోర్డు అధికారులు కుమ్మక్కై పొగాకు రైతులను నిలువునా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం కేంద్రాలకు వచ్చిన పొగాకు బేళ్ల లో అధిక భాగం నో బిడ్ లు వేసి, రైతులను మానసికంగా ఆందోళనలకు గురిచేసి, తక్కువ ధరలకే పొగాకు బేళ్లను అమ్ముకునేలా మానసికంగా వేధిస్తున్నారని

మిగతా 2 లో ...

## విపత్తు ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలి

### కలెక్టర్ జె.వెంకట మురళి

**విశాలాంధ్ర - బాపట్ల :** విపత్తు సంబవించినప్పుడు నిర్వహణపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తుషార్‌డూడి, సూర్యలంక ఎయిర్ బేస్ స్టేషన్ సెక్షన్ అధికారితో బుధవారం రాబోయే విపత్తు గురించి సమాలోచన చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో రాబోయే విపత్తుపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యలంక ఎయిర్ బేస్ స్టేషన్ కేటగిరి-2 పరిధిలోకి రాదని తెలిపారు. ఇక్కడ నుండి ఎటువంటి మిస్సైల్ దాడులు,ఆపరేషన్లు నిర్వహించడం లేదని ఆయన తెలిపారు.పాకిస్తాన్ నుండి మిస్సైల్ ప్రయోగించినప్పుడు సూర్యలంక ఎయిర్ బేస్ అధికారులు రాడార్ ద్వారా 200 కిలోమీటర్ల దూరం నుండి వాటిని పసిగట్టి పోలీసు వారికి సైరన్ ద్వారా ముందుగా హెచ్చరిక జారీ చేస్తారని తెలిపారు.ఆ హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.విపత్తు నివారణకు సంబంధించి కలెక్టరేట్ పరిధిలో ఒక కంట్రోల్ రూమ్,పోలీస్ శాఖ పరిధిలో మరొక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడుతుందన్నారు. సెల్ ఫోన్ టవర్లు విధ్వంసం అయ్యే పరిస్థితులు కారణంగా కలెక్టరేట్,పోలీసు,ఎయిర్ బేస్ స్టేషన్ వారితో అనుసంధానం చేయబడే ల్యాండ్ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.జిల్లాలో రిజర్వాయర్లు, డ్యాములు, రైల్వే లైన్లు ఏమైనా విధ్వంసం జరిగినప్పుడు వాటి ప్రత్యామ్నాయాలు గురించి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ వారు భవనములు విధ్వంసంకు గురైనప్పుడు ఆ భవనములలోని ప్రజలను ఏ విధంగా సురక్షితంగా తీసుకురావాలి వాటికి సంబంధించిన పరికరాల వివరములను పోలీస్ వారి సహకారంతో సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు.రవాణా శాఖ వారు అందుబాటుల గల ప్రొక్లైన్లు,టిప్పర్ల సమాచారాన్ని సేకరించి అందు బాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్, త్రాగునీటి సరఫరాల పునరుద్ధరణపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయా అధికారులకు సూచించారు.

## సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేద్దాం

**విశాలాంధ్ర-ఒంగోలు :** సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయుట, సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా, ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ల పర్యవేక్షణలో బుధవారం ఒంగోలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ మరియు జిల్లా పలు ప్రదేశాలలో అగ్ని పేలుడు, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఎక్స్‌ప్లోజివ్స్ అనుమానాస్పదమైన బ్యాగు ఉంచి ఆ ప్రదేశంలో దాన్ని గుర్తించి చేపట్టాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా పౌరులు బాధ్యతగా వ్యవహరించటం గురించి, పోలీసులు చేసే విధివిధానాలు గురించి క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ లో అనుమానాస్పదంగా బ్యాగు ఉన్నట్లు వచ్చిన సమాచారంపై వెంటనే పోలీసులు బీడీ టీం,స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు డాగ్స్ స్క్వాడ్ తో సంఘటన ప్రదేశానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. స్పెషల్ పార్టీ, బీడీ టీం సిబ్బంది రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించి అనుమానస్పద బ్యాగ్ ను గుర్తించారు. ఆ బ్యాగులో పేలుడు పదార్థాలు ఉన్నట్లుగా స్నిఫర్ డాగ్ గుర్తించింది. ప్రజలు ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా క్యూ మేనేజర్ ఏర్పాటు చేసినారు. పోలీసు సిబ్బంది బాంబు డిస్పోజల్ సూట్ ధరించి ఆ ఎక్స్ప్లోజివ్ నిర్వీర్యం చేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కీలకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్న 244 జిల్లాలను భద్రతాపరంగా ప్రత్యేకంగా గుర్తించి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి%శీ%దన్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాను ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అయితే కీలక ప్రభుత్వ సంస్థలు ఉన్న అన్ని ప్రదేశాలలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించినందున ఒంగోలు రైల్వే స్టేషన్, బస్సు స్టేషన్ లలో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించినట్లు చెప్పారు. నిజంగా ఉపద్రవం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి? వివిధ శాఖల సన్నద్ధత %-% సమన్వయలోపాలను తెలుసుకోవడం, ఇలాంటి సమయాలలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొంటామని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సింధూర ఆపరేషన్ నేపథ్యంలో ఎక్స్‌ప్లోజివ్స్ అనుమానాస్పదమైన బ్యాగు, ఉగ్రవాదులు దాడులు చేపడితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించామని, ఏదైనా ప్రదేశంలో సంఘ విద్రోహశక్తులు దాడులు చేస్తే అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తీసుకోవలసిన చర్యలు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏవిధంగా అప్రమత్తంగా వ్యవహరించాలనే విషయాల గురించి పౌరులకు అవగాహన కల్పించామన్నారు. రైల్వే స్టేషన్, బస్సు స్టాండ్ లతో పాటు టంగుటూరు పరిసర ప్రాంతాలలో పెట్రోలియం సంస్థలు, కేంద్ర,రాష్ట్ర ఆస్తులు కూడా ఉన్నందున వాటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. ఈ డెమో డ్రిల్ ద్వారా భవిష్యత్తులో సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు మరియు ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైసీపీ గూటికి ఏపీ ఎన్జీఓ మాజీ నాయకులు

**విశాలాంధ్ర-ఒంగోలు :** తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ సమక్షంలో ఏపీఎన్‌జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.వి.సుబ్బారావు, బండి శ్రీనివాసరావు వీరితో పాటు వైఎస్సార్‌సీపీలో చేరిన ఉమామహేశ్వర రావు, ఎం.విజయసింహ రెడ్డి, తోట సీతారామాంజనేయులు (ఎన్‌జీవో, రెవెన్యూ అసోసియేషన్స్ మాజీ రాష్ట్ర నాయకులు) చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది పొగాకు బోర్డు రాష్ట్రవ్యాప్తంగా 142 మిలియన్ కిలోల పొగాకు సాగుకు అనుమతించిందన్నారు. అయితే రైతులు గత ఏడాది 225 మిలియన్ కిలోల పొగాకును పండించారన్నారు. గత ఏడాది పొగాకు సరాసరి ధర కిలో కు రూ. 28 కల్పించారన్నారు. అయితే ఈ ఏడాది పొగాకు సాగు తగ్గించాలంటూ పొగాకు బోర్డు పేర్కొంటూనే 167 మిలియన్ కిలోల సాగుకు అనుమతించిందన్నారు. దీనిని బట్టి పొగాకు సాగును తగ్గించాలనే ఉద్దేశం పొగాకు బోర్డుకు కానీ, ప్రభుత్వానికి కానీ లేదన్నారు. అయితే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు పొగాకును మూడు నుండి నాలుగు సార్లు వరకు నాట్లు వేశారన్నారు. ఎరువులు, సాగు ఖర్చుతో పాటు కూలి రేట్లు కూడా గణనీయంగా పెరిగాయన్నారు. గతేడాది ధరలు ఇచ్చినా బ్యార్న్ కి నాలుగు నుండి, ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సరాసరి పొగాకు ధర కిలోకు రూ. 30 పైగా కేటాయిస్తేనే రైతులు నష్టాలు పాలు కాకుండా ఉంటారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యాపారులతో, పొగాకు బోర్డు అధికారులతో, రైతు సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించి గిట్టుబాటు ధరలకు పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతులు ఆదుకునేందుకు గతంలో కిలోకు రూ. 20 ప్రోత్సాహకం ఇచ్చిన మాదిరి, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రోత్సాహకం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు రైతులు సమస్యల పట్ల ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ చొరవ తీసుకొని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. లేనిపక్షంలో పొగాకు రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఈపాటికే పర్చూరులో మంగళవారం ఒక పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

**డీఆర్సీ మీటింగ్‌లో చర్చిస్తాం**
**- ఒంగోలు, సంతనూతలపాడు**
**ఎమ్మెల్యేల హామీ**

ఈనెల 12వ తేదీన నిర్వహించే డిఆర్సి మీటింగ్ లో పొగాకు రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఒంగోలు, సంతనూతల పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, బి ఎన్ విజయ్ కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడి త్వరలో పొగాకు బోర్డు అధికారులతో, వ్యాపారులతో, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈపాటికి సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పొగాకు రైతులు సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, కె వీరారెడ్డి, పొగాకు రైతులు పాల్గొన్నారు.

**వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద ...**

ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవి ప్రసాద్ అన్నారు. బుధవారం వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బృందం వెల్లంపల్లి పొగాకు కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పొగాకు పంట కొనుగోలు చేయకుండా బోద్యం చూస్తుందని తెలిపారు పొగాకు రైతులే కాకుండా వరి మిర్చి పంట సాగుచేసిన రైతులు చాలా కష్టాలు పడుతున్నారని అలాంటి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మక నిరీత్తినట్లు ఉన్నాయని మండిపడ్డారు. పొగాకు రైతులు ఆరుగాల శ్రమించి పండించిన పంటకు వ్యాపారులు సిండికేట్ అయి ధరలు కల్పించలేదని, అలా చేస్తే ఉద్యమం బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయశ్రీ పొగాకు కొనుగోలు పై పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు బోర్డు ఉన్నతాధికారులు పొగాకు రైతులు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వీరారెడ్డి మాట్లాడుతూ పొగాకు రైతులు పడుతున్న కష్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. రైతుల పక్షాన పోరాటాలు చేసి గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. ఎ పి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ పొగాకు వేలంకేంద్రంలో రైతులు తెచ్చిన పొగాకు కుంటి సాకులతో వెనక్కి పంపటం దారుణమైన చర్యని అన్నారు నోబిడ్, సిఆర్‌లు పేరుతో తెచ్చిన పొగాకు బెళ్ల ను వెనక్కి పంపిస్తే రైతు ఆ బెళ్లు ఇంటికి తీసుకెళ్లాలంటే ఎన్నో వ్యయ,ప్రయాసలు గురికావాల్సి వస్తుందని అన్నారు. వ్యాపారులు సిండికేట్ అయ్యి ధరలు పెరగకుండా చూస్తున్నారని మండిపడ్డారు. రైతులు పక్షంలో అండగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పనిచేస్తుందని తెలిపారు. వెల్లంపల్లి వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ రైతులు తెచ్చిన పొగాకును వెనక్కి తీసుకు వెళ్లకుండా పొగాకు వేలంకేంద్రం అధికారులు చూడాలని తెలిపారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రావి ఉమామహేశ్వరరావు, పావులూరి అంజయ్య,జజ్జర శరత్ బాబు, శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తొలగింపునకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరడం జరిగింది. ఈ 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు చైర్మన్ మురళీకృష్ణ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సహకరించడం లేదని బహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. వీరంతా ఎట్టి పరిస్థితుల్లో చైర్మన్‌ను దించాలని పట్టుదలతో ఉన్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి కౌన్సిలర్లు టిడిపిలోకి చేరడంతో ఆ పార్టీ బలం ఐదు నుండి 17కు పెరిగింది. దీనికి తోడు ఎమ్మెల్యే, ఎంపీ ఎటు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కావడంతో మున్సిపాలిటీని దక్కించుకునేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని ఆ పార్టీ భావిస్తోంది. మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌ల పదవులపై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి దించాలని టీడీపీ భావిస్తోంది.

**కాబోయే మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ రమ్య స్వాతి?**

టిడిపి తరపున మున్సిపల్ చైర్మన్‌గా వక్కలగడ్డ రమ్య స్వాతి పేరును ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఖరారు చేసినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

# విద్యుత్ ప్రభకు పర్మిషన్ కావాలా.. ముడుపులు చెల్లించాల్సిందే?

- ఒక్కో ప్రభకు పర్మిషన్‌కు రూ.30 నుంచి రూ.50 వేలు డిమాండ్
- అధికార పార్టీ వాళ్లయినా అంతే..
- 13 నుంచి ప్రారంభం కానున్న పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్లు

**విశాలాంధ్ర-పీసీపల్లి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామ సమీపంలో ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పాలేటి గంగమ్మ తల్లి తిరుణాళ్లో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ తిరుణాళ్లకు వివిధ పార్టీల నుంచి 09 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సంసిద్ధమయ్యారు. తెలుగుదేశం పార్టీ తరపున 05 వైయస్సార్సీపి పార్టీ తరఫున 03 బివైసీ పార్టీ తరఫున 01 విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సంసిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ప్రభలకు పర్మిషన్ పొందేందుకు ఒక్కో ప్రభకు రూ 30 వేల రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు ఏర్పాటు చేసుకునే రంగులరాట్నం దుకాణాలనుంచి కూడా వసూళ్ల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గత సంవత్సరం ఎన్నికల కోడ్ నిబంధన ఉండటంతో ఎలాంటి రాజకీయ పార్టీలు విద్యుత్ ప్రభలను నిర్మించలేదు ఈ సంవత్సరం అలాంటిది ఏమీ లేకపోవడంతో భారీగా విద్యుత్ ప్రభలు నిర్మించేందుకు నిర్వాహకులు ముందుకు వచ్చారు.

**అధికార పార్టీ నాయకులైనా ముడుపులు చెల్లించాల్సిందే**

ఇది ఇలా ఉండగా అధికార పార్టీ నాయకులు సైతం విద్యుత్ ప్రభ పర్మిషన్ కు ముడుపులు చెల్లించాల్సి వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ముడుపులు చెల్లించి పర్మిషన్ పొందాల్సి వస్తుందని అధికార పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. పర్మిషన్‌కు చెల్లించే 50 వేల రూపాయలు మరో అవసరానికి ఉపయోగించుకుంటే ఖర్చులు తగ్గుతాయని భావిస్తూనే అనవసరపు సమస్యలు ఎందుకని ముడుపులు చెల్లించి పర్మిషన్ తెచ్చుకోవాల్సి వస్తుందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

**ప్రభలపై డ్యాన్సులకు అనుమతి ఉందా?**

విద్యుత్ ప్రభలపై ఇరు పార్టీల నిర్వాహకులు పాటకచేరీలను నిర్వహిస్తుండడంతో ఇదే అదునుగా భావించిన సంబంధిత అధికారులు ప్రబల నిర్వాహకులతో కుమ్మక్కైనట్లు తెలుస్తుంది ఒక్కో కరెంటు ప్రభ పై 20 నుంచి 25 మంది అమ్మాయిలతో డాన్స్ వేసేందుకు అనుమతులు కూడా ఇస్తున్నట్లు తెలుస్తుంది ఇందుకోసమే ఒక్కో ప్రభనించి రూ 30 వేల రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు ముడుపులు చెల్లించాల్సిందేనని నిర్వాహకులకు హుకూం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనప్పటికీ అధికారుల ఆంక్షలతో విద్యుత్ ప్రభల నిర్వాహకుల జేబులకు చిల్లులు పడటం ఖాయంగానే కనిపిస్తుంది.

## పాలేటి గంగమ్మ తిరునాళ్లకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ఆహ్వానం

**విశాలాంధ్ర-పిసీపల్లి :** ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం పెద అలవలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని వెంగలాపురం గ్రామ సమీపంలో ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ల ఈనెల 13 నుంచి 17 వరకు జరగనున్న నేపథ్యంలో 16న పోతవరం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ వెలుగులతో ఏర్పాటు చేయనున్న తడిక ప్రభ భక్తులను అలరింపజేయనున్న నేపథ్యంలో అత్యంత వైభవంగా ఏర్పాటు చేయనున్న పాట కచేరి కార్యక్రమానికి తప్పక రావాలంటూ ఆహ్వాన పత్రికను మురుగమ్మి ఎంపీటీసీ సభ్యులు చెరుకూరి సతీష్ కుమార్ పోతవరం గ్రామానికి చెందిన రావి రాజా పోతవరం సర్పంచ్ తాలూకా గ్రామ ప్రజలు స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని కలిసి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత వైభవంగా నిర్వహించే పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్లకు తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన కదిరి బాబురావు

**విశాలాంధ్ర-సీఎస్‌పురం :** తాడేపల్లి లోని వైయస్సార్సిపి కేంద్ర కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు హాజరయ్యారు. తనను విశాఖపట్నం పార్లమెంటు పరిశీలకులుగా నియమించినందుకు జగన్మోహన్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సిపి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు కదిరి బాబురావు తెలిపారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

**విశాలాంధ్ర-ముండ్లమూరు :** మండల వాసులు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం పలువురు భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలు చేరుకొని విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముండ్లమూరు రెండు చోట్ల పోటాపోటీగా వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారు భూత భవిష్యత్తు, వర్తమాన కాలజ్ఞానాన్ని రచించి దుష్ట శిక్షణ. శిష్ట రక్షణార్థం, తపోనిష్టతో వైశాఖ శుద్ధ దశమి రోజున జీవ సమాధి అయిన సందర్భంగా ఆ రోజున స్వామి వారి ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**విశాలాంధ్ర-పొన్నలూరు :** పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని కోరిన కోరికలు తీర్చే దైవంగా ఆరాధిస్తారు. స్థానిక మండల కేంద్రమైన పొన్నలూరులో ఎన్టీఆర్ కూడలి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, మాలపాడు మరియు చౌటపాలెం గ్రామాలలోని బ్రహ్మంగారి దేవాలయాలలో బుధవారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులు కీర్తనలు, భజనలు చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలుచేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి సమయంలో గ్రామాలలో స్వామివారిని వీధి వీధికి మేళతాళాలతో, తప్పెటలతో, దీపములు కాంతితో ఊరేగింపుతో ఉత్సవం నిర్వహించారు. మాలపాడు గ్రామంలో బ్రహ్మంగారి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభను లను ఏర్పాటు చేశారు. మాలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వారు నిర్వహించిన విద్యుత్ ప్రభ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మరియు వైయస్సార్సీపి వారు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ ముఖ్యఅతిథిగా కొండపి నియోజకవర్గ కన్వీనర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాలను భక్తులు మండలంలో ప్రజలు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి దామోదరం సంజీవయ్య

**విశాలాంధ్ర-ఒంగోలు :** దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ మస్నం ప్రసన్నరాజు అధ్యక్షతన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ ముఖ్యఅతిథిగా పాల్గొని దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా, మొదటి దళిత ముఖ్యమంత్రిగా పేద ప్రజల పక్షాన నిలబడి, నిరంతరం బడుగు బలహీన వర్గాల పక్షాన నిలుచుని వారి అభివృద్ధికి కృషి చేశారని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా రెండుసార్లు సేవలు అందించారని, కాంగ్రెస్ పార్టీ దామోదరం సంజీవయ్య ఆశయాలను కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుదర్శి రవి, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ టి సుధీర్ వర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొద్దు సతీష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సుభాన్ పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

**విశాలాంధ్ర-ఒంగోలు :** స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డి పాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది గ్రామస్థులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బి.పి. గుండె, గ్యాస్ట్రబుల్, ఎముకలు, కీళ్ళు, నరములు, స్త్రీ సంబంధిత, కంటి సంబంధిత పరీక్షలు ఉచితంగా చేశారు. ఇ.సి.జి, షుగర్, బి.పి. పరీక్షలు చేసి అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవ కూడా అలవాటు పడేలా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని, క్విస్ కళాశాల, ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ముందు ఇంకా నిర్వహిస్తామని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి అన్నారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ కి చెందిన డాక్టర్ అశోక్ కుమార్ (గ్యాస్ట్రో), డాక్టర్ లక్ష్మీ శ్వేత (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఉదయ్ కుమార్ (ఆర్థో), డాక్టర్ ఆనంద యాదవ్ (కార్డియాలజీ), డాక్టర్ రామాంజనేయులు (జనరల్ మెడిసిన్) తమ సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, ఎన్ సీసీ హెడ్ డాక్టర్ వాసుబాబు, ఎన్ ఎస్ ఎస్ పీవోలు శిరీష, వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు వృద్ధులకు, నడవలేని వారికి సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ పి.సుబ్బారావు, పంచాయతి సెక్రటరీ భాగ్యలక్ష్మీ, స్కూల్ హెడ్ మాస్టర్ రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

**విశాలాంధ్ర-పెద్ద దోర్నాల :** మండల కేంద్రమైన దోర్నాలలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో మరియు కడప రాజు పల్లెలోని బ్రహ్మంగారి. ఆలయంలో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కడప రాజు పల్లె ఆలయ పూజారులు పి.మల్లికార్జున చారి, దోర్నాల ఆలయ పూజారి సుధాకర్ ఆచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దోర్నాల బ్రహ్మంగారి ఆలయంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

– తహసీల్దార్ సురేష్

**విశాలాంధ్ర-కొనకనమిట్ల :** మండలంలో రేషన్ కార్డు లేని వారు కొత్త రేషన్ కార్డులు మంజూరు కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆవుల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా రేషన్ కార్డు మంజూరు కోసం ఆయా గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుదారులు ఆధార్ కార్డు ఫోన్ నెంబరు తీసుకుపోయి డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. కొత్తగా వివాహమైన వారు వారి వివాహ సర్టిఫికెట్ ఆధార్, పుట్టిన పిల్లల రేషన్ కార్డులో నమోదు చేయాలంటే వారి బర్త్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. కార్డులలో మార్పులు చేర్పులకు కుటుంబ సభ్యులందరూ అందుబాటులో ఉండాలని, రేషన్ కార్డు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## గ్రామ పంచాయతీలు అందంగా తీర్చిదిద్దాలి

డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ

**విశాలాంధ్ర-ముండ్లమూరు :** గ్రామాలను చూడ చక్కని గ్రామపంచాయతీలుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు పై ఉందని ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిని ఆర్ పద్మ అన్నారు. మండలంలోని నూజిల్లపల్లి, తూర్పు కంభంపాడు గ్రామాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా గ్రామాల్లో గల పిడుబ్బుసి షెడ్లను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తకుప్పలను తీసి వేయించాలన్నారు. బజార్లు వెంట ఇండ్లు ముందు ఉన్న పెడదిబ్బలను తొలగించాలన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వేరువేరుగా ఎండ పెట్టాలన్నారు. వర్మీ కంపోస్ట్ ఎరువును విక్రయించి త ద్వారా వచ్చిన ఆదాయంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బి.వేణుగోపాలరావు, టి స్వర్ణలత, గ్రీన్ అంబాసిడర్లు, పాల్గొన్నారు.

## రామిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు

**విశాలాంధ్ర-కొనకనమిట్ల :** రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కామసాని రామిరెడ్డి ఆయన సతీమణి రమాదేవిల 23వ వివాహ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని నాగరాజు కుంట గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. మండలం లోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు రామిరెడ్డి దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి వివాహది వార్షికోత్సవ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు మూరబోయిన బాబూరావు, మాజీ టిడిపి అధ్యక్షులు తాటిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, వరికూటి వెంకటరామిరెడ్డి, టిడిపి నాయకులు కుందూరు కాశిరెడ్డి, జవ్వాజి భాషాపతి నాయుడు తెలుగు యువత నాయకులు ముప్పా కాటమరాజు, సొసైటీ అధ్యక్షులు కనకము నరసింహారావు, స్టాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, దుంప కృష్ణారెడ్డి, నాయకులు పరిటాల సుబ్బయ్య, కే సాల్మన్ కిలారి బొంతయ్య, బాపతి కృష్ణారెడ్డి, భీమాంజనేయరెడ్డి, వేంపాటి శ్రీకాంత్ రెడ్డి, ముక్కాల శ్రీనివాసులు రెడ్డి, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు వివాహాది శుభాకాంక్షలు తెలిపారు.

## సమ్మె నోటీసు ఇచ్చిన ఆశా వర్కర్లు

**విశాలాంధ్ర-కురిచేడు :** స్థానిక ఆశా వర్కర్లు కనీస వేతనము 26 వేల రూపాయలు ఇవ్వాలని రిటైర్డ్ బెనిఫిట్ లక్ష రూపాయలు ఇవ్వాలని ఆశా వర్కర్లు కురిచేడు మండల అధ్యక్ష కార్యదర్శులు యు కొండమ్మ ఎం.నాగమల్లేశ్వరి బుధవారం స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రవితేజకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20 తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే కార్మిక కర్షక సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొంటున్నట్లు స్థానిక ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొనాలని అన్నారు. అనేక సంవత్సరాలుగా గర్భిణీలు బాలింతలు టీబీహెచ్ఐవి తదితర రోగులకు సేవలందిస్తున్నటువంటి ఆశ వర్కర్లు వేతనాలు చాలగా అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాగే ఆశ వర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యం రిటైర్మెంట్ వయసు 62లకు పెంచడం మృతి చెందినప్పుడు మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పి.యోగేశ్వరమ్మ కృపమ్మ సరస్వతి సుశీల లక్ష్మి గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనం 'అల్లూరి'

ఎస్పీ దామోదర్

**విశాలాంధ్ర-ఒంగోలు :** స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు, గుంటూరు రోడ్‌లో గల ఏ వన్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ దామోదర్ మరియు పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు గారి పోరాటపటిమను కొనియాడారు. బ్రిటిష్ వారి నిరంకుశ చర్యలు వలన మన్యం ప్రజలు ఎదుర్కొంటున్న దీనస్థితిగతులను పరిశీలించి ప్రజలను చైతన్య పరిచి విప్లవానికి నాంది పలికాడని, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల వయసు లోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమని, అతడి దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు గారు చింతపల్లి ఏరియాలో ఉద్యమం చేసిన ప్రాంతంలో తను ఓఎస్డిగా పని చేశానన్నారు. సీతారామరాజు గారు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమని, ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభల కర పత్రాల ఆవిష్కరణ

**విశాలాంధ్ర-దొనకొండ:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపిఐ) 17వ ప్రకాశం జిల్లా మహా సభల కర పత్రాలను మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి బుధవారం ఆవిష్కరించారు. గురుమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 21, 22, 23వ తేదీల్లో నియోజకవర్గ కేంద్రమైన దర్శి పట్టణంలో జిల్లా మహాసభలను నిర్వహించి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ నిర్మాణ అంశాలతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా నలుమూలల నుండి సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కావున మండలంలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలంటూ గురుమూర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రుద్రసముద్రం శాఖ కార్యదర్శులు చెన్నుబోయిన కాశయ్య, బచ్చలకూరి మరియదాసు, సహాయ

కార్యదర్శులు చెన్నుబోయిన ఆంజనేయులు, బచ్చలకూరి ఏసు, బచ్చలకూరి పెద్దకాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీమాత జయంతి

**విశాలాంధ్ర-దొనకొండ:** ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ మాత జయంతి వేడుకలను ఆ సంఘ మండల అధ్యక్షులు కాళ్ళ హనుమంతు, పట్టణ అధ్యక్షులు పరుచూరి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ పట్టాభి రామా లయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి, వీధుల్లో వాసవీమాత విగ్రహ ఊరేగింపు చేసిన అనంతరం దేవాలయంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన పూజలు చేయించారు. మండలంలోని ఆర్య వైశ్యులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనగా దేవాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది.

## మా కూలి ఇప్పించండి

శ్రీకర విల్లాస్ వద్ద కూలీల ధర్నా

**విశాలాంధ్ర-ఒంగోలు :** స్థానిక వెంగముక్కపాలెం రోడ్‌లో గల శ్రీకరి ఎంపైర్ విల్లాస్ అధినేత ఈ విల్లాసులోపని చేసిన కూలీలకు డబ్బులు ఇవ్వ లేదని వెంగముక్క పాలెం గ్రామానికి చెందిన అజయ్ కుటుంబ సభ్యులు విల్లాస్ ప్రవేశ ద్వారం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు.

తమకు రావలసిన సుమారు రూ.6 లక్షల డబ్బు చెల్లించాలని తెలిపారు. పలుమార్లు విల్లాస్ అధినేతకు ఫోన్ చేసిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు రావలసిన డబ్బులు ఇచ్చి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# 50శాతం రాయితీపై విత్తనాలు

**విశాలాంధ్ర-కొమరోలు :** ప్రస్తుతం వ్యవసాయశాఖలో పచ్చిరొట్ట విత్తనాలు అయిన జనుములు, పిల్లి పెసరలు, జీలుగులు 50 శాతం రాయితీపై అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె.రాజశ్రీ తెలియజేసారు. పచ్చి రొట్ట వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సూక్ష్మ జీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు జరిగి నేల సారం పెరగడంతోపాటుతోపాటు ఉత్పాదకత సామర్థ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. నేలలోకి చాలా రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని, ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యతను నేలలోని సూక్ష్మ జీవులు పెంచుతాయని తెలిపారు. పప్పు జాతి పంటల (పిల్లి పెసర) వల్ల రైజోబియం బ్యాక్టీరియా పెరగడం వల్ల ఎకరానికి 20 నుంచి 50 కేజీల నత్రజని అందుతుంది కావున ఆ మేరకు ఎరువులు తగ్గించుకోవచ్చుని, కలుపు మొక్కలు పెరగకుండా ఇవి కాపాడతాయన్నారు. భూమి లోతుల్లో ఉన్న పోషకాలను కూడా ఉపరితలానికి తీసుకొచ్చి పంట మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయని పేర్కొన్నారు. జీలుగ పంటను చౌడు భూముల్లో వేయడం జరుగుతుందని, ఎకరానికి 10 నుంచి పన్నెండు కిలోల విత్తనాన్ని ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకొని పూత దశకు వచ్చాక కలియ దున్నితే ఎకరానికి 9 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుందని తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో రైతు వాటాను చెల్లించి నమోదు చేసుకుని విత్తనాలు పొందవచ్చునని వ్యవసాయ అధికారి కే రాజశ్రీ తెలిపారు.

## కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని వీరన్నపాలెంలో పొగాకు కొనుగోలు జరగక అప్పులు బాధలు పెరిగి ఆత్మహత్య చేసుకున్న ఉప్పుటూరు సాంబశివరావు కుటుంబాన్ని పరామర్శించిన రైతు సంఘం,కౌలు రైతు సంఘాల జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య,టి.రామారావు,పి.కొండయ్య, శ్రీనివాసరెడ్డి,మక్కెన వెంకన్న,మత్తె దేవిడ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.అప్పుల బాధతోనే సాంబశివరావు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పొగాకు అమ్ముడుపోనందు వలనే మానసిక వేదనకు లోనై గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకున్నాడని,సాంబశివరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుమారుడు, కుమార్తె చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని నాయకులు కోరారు.

## బోడవాడలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - పర్చూరు : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చటానికి చీరాలకు చెందిన గెరార్డ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్చూరు మండలం బోడవాడ గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవంను పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఆళ్ల మస్తాన్ రావు,మాజీ ఎంపిపి కొల్లా వెంకట రావు, రిటైర్డ్ నేవీ ఆఫీసర్ వడ్లాణం బాబు రావు చేశారు.వారు మాట్లాడుతూ గెరార్డ్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన ట్రస్టీ గెరా స్వరాజ్, ట్రస్టీలు తానికొండ జయానంద్, అల్లడి సంతోషం, స్థానిక నాయకులు కూరాకుల ఇస్సాకు బాబు, గాజుల రమేష్, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతు కుటుంబానికి సంతాపం

విశాలాంధ్ర - పర్చూరు : మండలం లోని వీరన్నపాలెం గ్రామంలో అప్పులు బాధతో ఆత్మహత్య చేసుకున్న సాంబ శివరావు కుటుంబాన్ని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి రామ కృష్ణ ఆదేశాల మేరకు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగబైరు మోహన్ రావు,మండల వ్యవసాయ అధి కారి రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది,

తహసిల్దార్ బ్రహ్మయ్య తదితరులు పరామర్శించారు. సాంబశివరావు 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంటను పండించారని, స్థానిక బ్యాంకులో కౌలు రైతు రుణం కింద రూ.లక్ష రుణం తీసుకున్నారని, బయట రూ.22 లక్షల అప్పు చేశారని కుటుంబ సభ్యులు తెలిపారని వారు తెలిపారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు, గ్రామంలో విచారించిన మీదట నివేదికను ఉన్నతాధికారులకు అందించి ప్రభుత్వం నుంచి రావలసిన సహాయ సహకారాలను అందించటానికి కృషి చేస్తామని ఏడిఏ మోహనరావు తెలిపారు.

## నేటి నుంచి స్వామివార్ల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని చెరుకూరులో వేంచేసియున్న శ్రీ అగస్తేశ్వర,త్రివిక్రమ స్వామివార్ల కళ్యాణ మహోత్సవం ఎనిమిదో తేదీ నుండి 14వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు.భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఆయన కోరారు.

## విప్లవ వీరుడు 'అల్లూరి'కి ఘన నివాళి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మన్యం ప్రజల గుండెల్లో విప్లవ జ్యోతులు రగిలించి,బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణం సూర్యలంక రోడ్ ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, క్షత్రియ సేవా సంఘం సభ్యులతో కలసి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో అలుపెరగని పోరాటం జరిపి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులు అల్లూరి సీతారామరాజు అన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయుధాలు చేపట్టి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అడవుల్లో గెరిల్లా యుద్ధానికి నాయకత్వం వహించి వారిని తరిమి కొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు కాకర్లమూడి భాస్కర్ రాజు,సభ్యులు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,తెదేపా నాయకులు మందపాటి ఆంధ్రయ, దగ్గల్లి రాణి,టిడిపి సీనియర్ నాయకురాలు మాజీ ఎంపీటీసీ కాగిత నాగభూషణ కుమారి,బీమా కోటేశ్వరరావు,శ్రీనివాస్ కుమార్ అల్లం గోపీకృష్ణ,సరోజినీ,జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**- జనసేన పార్టీ ఆధ్వర్యంలో :**

గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా బ్రిటీష్ పాలకులను ఎదిరించి పోరాడి సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి తన ప్రాణాలను సైతం అర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ అన్నారు. విప్లవ జ్యోతి,మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ కొనియాడారు.బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు 128 వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పార్టీ నాయకులు కార్యకర్తలుతో కలసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని తెలిపారు.విశాఖ జిల్లా పాండ్రంగిలో 1897 జులై 4న అల్లూరి సీతారామరాజు జన్మించారని వారి స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా మొగల్లు

ప్రాంతమని సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం సాధ్యమని నమ్మి తన ప్రాణాలను సైతం అర్పించిన మహాయోధులు అల్లూరు సీతారామ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షుడు గోట్టిపాటి శ్రీకృష్ణ, జనసేన నాయకులు పసుపులేటి మహేష్,విష్ణు మొలకల చంద్ర మోహన్, తిరుమలశెట్టి సాగర్, చిలకల సురేంద్ర, దాసరి వినోద్, కంచర్లపల్లి నరేంద్ర, పడమటి ధర్మా రావు గౌడ్, సాయిన రాంబాబు, దండుప్రోలు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**- బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో**

గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి అన్నారు. బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి అల్లూరి సీతారామ రాజు 128 వర్ధంతి సందర్భంగా మునిసిపల్ సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతా రామ రాజు అని తెలిపారు.అల్లూరి సీతారామరాజు ఆదర్శాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మయ్య,డిప్యూటీ ఇంజనీరింగ్ కృష్ణారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ జబ్బర్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కరుణ, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అల్లూరి సీతారామరాజు ఏ ఆశయం కోసం పోరాడారో నేటి యువత ఆ ఆశయాల కోసం పోరాడాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. మన్యం ప్రజల కోసం తన జీవితాన్ని అర్పించిన గొప్ప త్యాగశీలి అల్లూరి అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సూర్యలంక రోడ్డులో ఉన్న అయన విగ్రహా నికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులపై తిరుగు బావుట ఎగరేసిన మన్యం పులి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు.దేశంలో బ్రిటీష్ తెల్లదొరల దోపిడీని వ్యతిరేకిస్తూ, ఆదివాసీ గిరిజనులలో చైతన్యం నింపి గొప్ప పోరాటాలు నడిపిన మహాయోధుడు అల్లూరి అని పేర్కొన్నారు.మన్యం పోరాటం విప్లవోద్యమాల్లో నిలిచి ఉంటుందన్నారు. పశ్చిమ గోదా వరి జిల్లా మొగల్లులో జన్మించి అటవీ ప్రాంతాలలో తిరుగుతూ మన్యం ప్రజలను ఉత్తేజపరుస్తూ చైతన్య స్ఫూర్తి నింపిన మహనీయుడు అల్లూరి అన్నారు. చిన్నతనంలోనే దళిత, గిరిజన ప్రజల హక్కు ల కోసం, భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అతి చిన్న వయసులోనే తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

**- తహసీల్దార్ సంగయ్య**

విశాలాంధ్ర - జె.పంగులూరు : కొత్త రేషన్ కార్డులు కావలసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని జె.పంగు లూరు మండల తహసీల్దార్ పోపూరి సింగయ్య మండల ప్రజలకు తెలియజేశారు. ఇప్పటి వరకు రేషన్ కార్డు లేని వారు కొత్త రేషన్ కార్డు పొందెందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గవర్న మెంట్ సర్వీసెస్ వెబ్సైట్ జి.ఎస్. డబ్ల్యు.ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించిందని, ఈ వెబ్సైట్ ద్వారా రేషన్ కార్డుకు సంబం ధించి ఏడు రకాల సేవలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని మండల ప్రజలు ఆయా గ్రామ సచి వాలయాలు ద్వారా ఈ వెబ్ సైట్లో దర ఖాస్తు చేసుకోవచ్చు అని తహసీల్దార్ పత్రికా ముఖంగా ప్రజలకు తెలియజేశారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఇసుకపల్లి 17వ వార్డ్కు చెందిన మోపిదేవి సుమతి (41) బుధ వారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఆమె ఇంటి ప్రక్కన ఉన్న నిమ్మ చెట్లకు నీళ్ళు పెడుతుండగా ప్రక్కనే విద్యుత్ వైరు తెగి నిమ్మ చెట్టుపై పడిపోవటంతో నిమ్మ చెట్టుకు కరెంట్ వచ్చి మోపిదేవి సుమతి కరెంట్ షాక్ తగిలి కింద పడిపోగా అది గమనించిన ఆమె భర్త వెంటనే రేపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళగా డాక్టర్ చూసి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఇచ్చిన రిపోర్ట్ మేరకు రేపల్లె పోలీస్ స్టేషన్ సీఐ మల్లిఖార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నాయకులు కసపర్తి నాగేశ్వరావు అన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు యద్దనపూడి గ్రామానికి చెందిన గోనుగుంట్ల సుబ్బారావు ఇటీవల ఆరోగ్యం బాగాలేక హాస్పటల్లో చికిత్స చేయించుకోగా, కసపర్తి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేయించగా రూ. 42వేల చెక్కును ఆయన అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కసపర్తి నాగేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు,షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పాదయాత్ర చేయాలి

**– మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చల్లా రామయ్య**

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రంలో మళ్లీ పాదయాత్ర చేపట్టాలని వైయస్సార్సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కోరారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో మాజీ సిఎం వైయస్ మోహన్ రెడ్డిని రామ య్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రజలకు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు మరెన్నో హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందన్నారు. నేడు ప్రజలకు ఏ సంక్షేమ పథకాలు అందించకుండా అమరావతి రాజధాని ముసుగులో కల్లబొల్లి మాటలు చెబుతున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పాలంటే మళ్లీ వైసీపీ అధికారంలోకి రావాలని కోరారు.ప్రజల సమస్యల కోసం తీర్చడం కోసం,సంక్షేమ పథకాల అమలు వైసీపీతోనే సాధ్యమవుతుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మళ్లీ పాదయాత్ర చేయాలని కోరారు.

## ఏల్చూరులో వాసవిమాత జయంతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఆర్యవైశ్యులు ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఏల్చూరులో కొలువుదీరిన వాసవిమాత ఆలయంలో వేకువజామున నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వినుకొండ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య కన్యకా పరమేశ్వరికి చక్రస్నానాలు, అర్చనలు,పంచామృత అభిషేకాలు జరిపారు. పూలమాలలు, పట్టువస్త్రాలు, వెండి ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. నైవేద్యం, కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.మహిళలు పసుపు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

## బీసీ వెల్ఫేర్ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - అద్దంకి : బాపట్ల జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యవర్గ సమావేశం బీసీ వెల్ఫేర్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు అధ్యక్షతన బుధవారం సింగరకొండ వద్ద జరిగింది.ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా కొండూరు గోవింద, ఉపాధ్యక్షులుగా గుంజి కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా కడియం రేణుక రవికుమార్, జిల్లా ఆర్గనైజర్‌గా నటరాజన్‌లను ఎన్నుకున్నట్లు ఆదిశేషు తెలిపారు .

## రైస్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైస్ కార్డులు లేని అరులైన వారు కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎన్.నాగ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ కొత్త రైస్ కార్డుల జారీ,రైస్ కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఆధార్ సీడింగ్, కార్డులు సరెండర్ చేయడం లాంటి సేవలను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి అవకాశం కల్పించిందన్నారు. ఈ సేవలను పొందేందుకు అర్హులైన వారు తమ సమీపంలోని గ్రామ సచివాలయాలను సందర్శించి డిజిటల్ అసిస్టెంట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## 12న రథోత్సవం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి మే నెల 12వ తేదీన పేరాల శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీ పునుగు రామలింగ మల్లేశ్వర స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుపుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. 54 సంవత్సరాల క్రితం చీరాల పేరాల శివారులలో చిన్న రథం,పెద్ద రథం కూడళ్ల ఉండేవి.కాల గమనంలో రథాలు శిధిలమై పోగా స్వామి వార్ల నగరోత్సవాలు బండ్ల మీద, ట్రాక్టర్ల మీద నిర్వహిస్తూ వస్తున్నారు.కానీ అన్నదాత పాండురంగ రావు చొరవతో విరాళాలు సేకరించి మూడు సంవత్సరాలుగా నూతన రథ నిర్మా ణం ప్రారంభించి పూర్తి చేశారు. 45 అడుగుల ఎత్తు, 14.5 అడుగుల వెడల్పుతో 6 చక్రాలను అమర్చి రూ.ఒక కోటి ఇరవై లక్షల ఖర్చుతో పురాతన సాంస్కృతిక పద్ధతులతో రథ నిర్మాణం పూర్తి చేశారు. దేవస్థానం ఆవరణలోనే రథాన్ని నిలిపి ఉంచడానికి రూ. 11 లక్షల పైగా ఖర్చుతో షెడ్ నిర్మించారు. ఎందరో మహానుభావుల సంకల్ప బలంతో 54 సంవత్సరాల తర్వాత రథోత్సవానికి నూతన రథం అందుబాటులోకి వచ్చింది. రథోత్సవాన్ని కన్నుల పండుగగా జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## అర్హత కలిగిన రైతులను గుర్తించాలి

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం-2 రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయ అధికారి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నా అన్నదాత సుఖీభవ పథకం లబ్దిదారుల గుర్తింపునకు వెబ్‌ల్యాండ్ డేటా గ్రామ వ్యవసాయ సహాయకుల లాగిన్‌కు ఇవ్వడం జరిగింది. ప్రతి వి.ఏ.ఏ ప్రతి గ్రామంలో రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన లబ్దిదారులను గుర్తించాలని,ఆధార్‌లో అవకతవకలు వున్న రైతుల వివరాలను ఎం.ఆర్.ఓ లాగిన్‌లో సరైనా ఆధార్ నమోదు చేయించుకొని పథకానికి లబ్దిదారులు కావడానికి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ప్రతి రైతు తప్పనిసరిగ ప్రతీ పంటను ప్రతి సీజన్‌లోను ఈ-పంట నమోదు చేయించుకోవాలని,భూసార పరీక్షలు చేయించుకొని సోయిల్ హెల్త్ కార్డు పొందాలని,పీ.ఎం కిసాన్ కోసం కొత్తగా నమోదు చేయించుకోవలసినకునే రైతులు ప్రస్తుతం నమోదు చేయించుకొని పి.ఎం కిసాన్ పథకానికి లబ్దిదారులు అయ్యే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

## విశ్వకవి, మన్యం వీరునికి నివాళులు

విశాలాంధ్ర - సంతమాగులూరు : స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో 9వ రోజు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముందుగా ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జన గణమన గేయం రచించిన ఠాగూర్, స్వాతంత్ర్య కాంక్షతో ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించిన అల్లూరి జీవిత చరిత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారి స్ఫూర్తితో భవితకు బంగారు బాటలు వేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## నాటు సారా స్వాధీనం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.నాగేశ్వర రావు సిబ్బందితో కలిసి చీరాల మండలంలోని వివిధ ప్రదేశాలలో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. మండలంలోని తోట వారిపాలెం గ్రామంలోని దండియా కాలనీలో పి.శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్సైజ్ చట్ట ప్రకారం నాటుసారా కలిగి ఉండడం, రవాణా చేయటం,అమ్మడం నేరమని తెలిపారు.

## యద్దనపూడిలో గాలి వాన బీభత్సం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో ఉరుములతో గాలి, వాన, బీభత్సం సృష్టించింది. మండలంలోని పూనూరు,చింత గుంటపాలెం, గన్నవరం, మున్నంగివారిపాలెం, చిమట వారిపాలెం తదితర గ్రామాలలో, విపరీతమైన గాలి, ఉరుములతో వర్షం పడటంతో మొక్క జొన్న రైతులు ఇబ్బందులకు గురి అయినారు. పొలాలలో ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలు తడుస్తాయని రైతుల ఆందోళనలో చెందారు. పొగాకు కొనే నాథుడు లేకపోవటంతో రైతులు ముందు జాగ్రత్త చర్యగా గ్రామాలలో పొగాకు మండేలపై పర దాలు కప్పి జాగ్రత్త పడటంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

విశాలాంధ్ర - అద్దంకి : శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేం ద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు పట్ట ణంలోని గోవింద మాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో వైభవంగా జరి గాయి. భక్తులు వీర బ్రహ్మేంద్ర స్వామిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

## డీఎస్సీ నోటిఫికేషన్‌లో మాజీ సైనికులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : డీఎస్సీ నోటిఫికేషన్‌లో మాజీ సైనికులకు రెండు శాతం రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేయాలని ఉపాధ్యాయుల బదిలీల విషయంలో మాజీ సైనికులకు సైనికుల భార్యలకు గతంలో చేసినట్లే ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద బదిలీలు చేపట్టాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అమరావతిలో రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుని కలిసి వినతి పత్రాన్ని అందించారు. అచ్చెన్నాయుడు వెంటనే స్పందించి మాజీ సైనికుల సమస్యల గురించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారన్నారు.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ,మంగళవారం రాత్రి భారతీయ సైనిక దళాలు పాకిస్తాన్‌పై చేసిన మెరుపుదాడులు గురించి ప్రత్యేకంగా చర్చించి,ఇక ముందు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే ప్రతి చర్యలలోనూ మాజీ సైనికులు భాగస్తులు కావటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం కమిటీ తరుపున అచ్చెన్నాయుడికి అంగీకార పత్రాన్ని అందజేశారు.అనంతరం తాండ్ర సాంబశివరావు రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి విద్యాశాఖ డైరెక్టర్ విజయరామ రాజును కూడా మర్యాదపూర్వకంగా కలిసి,విద్యాశాఖ పరిధిలో ఉన్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో మాజీ సైనికులు ఎదుర్కొంటున్నలో రెండు శాతం రిజర్వేషన్ల ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద బదిలీల విషయాలపై చర్చించి తగిన విధంగా న్యాయం చేయాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్, గౌరవాధ్యక్షులు రామారావు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, సీని యర్ మాజీ సైనికులు గుంటూరు జిల్లా మాజీ సైని క సంక్షేమ సంఘం అధ్యక్షులు గోవింద రావు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**విశాలాంధ్ర-ఒంగోలు :** మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఒంగోలులోని మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, బి.ఎన్.విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, పలు సంఘాల నేతలు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విలేకరులతో మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి సీతారామరాజు చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఒంగోలుశాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి ఎదురునిలిచి అడవి బిడ్డలకు అండగా నిలిచి 27 సంవత్సరాల వయస్సు లోనే ప్రాణత్యాగం చేసిన యోధుడు అల్లూరి అన్నారు. బ్రిటిష్ వారికి చెప్పి వారి ఆయుధాలు కొల్లగొట్టిన మొనగాడు సీతారామరాజు అని అన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయకుమార్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

# ఉన్నత విద్యలో నైపుణ్యాలతో కూడిన ఉపాధి కల్పనే కీలకం

**విశాలాంధ్ర - మార్కాపురం టౌన్ :** ప్రస్తుత ఉన్నత విద్యారంగంలో నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పన కీలక అంశాలని ప్రకాశం జిల్లా నైపుణ్య శిక్షణా సంస్థ మేనేజర్ రవితేజ అన్నారు. బుధవారం మార్కాపురంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాల నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర నైపుణ్య శిక్షణా విభాగం అధ్వర్యంలో జరుగుతున్న ఉద్యోగ కల్పనల తో పాటు కళాశాల నేరుగా ప్రముఖ ఐటి సంస్థలైన టి.సి.యస్, విప్రో, ఇన్ఫోసిస్, డి.యక్స్.సి టెక్నాలజీస్, మైండ్, యాక్సెంచర్, టెక్ మహీంద్ర, బైజూస్, త్రైమర్ ప్రముఖ ఔషధ తయారీ సంస్థలైన దివీస్, అరబిందో, హెటిరో, ట్రైమాక్స్ తదితర సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను 10 సంవత్సరాలుగా ఉద్యోగాలు సాంధించిన వారి జాబితాలను పరిశీలించిన రవితేజ కళాశాల ప్రాంగణ నియామక విభాగం పనితీరును ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ కళాశాల క్యాంపస్ రిక్రూట్మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె.వి.యస్.ఆర్. పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త యమ్.శేషుకుమార్, కళాశాల అకడమిక్ ఇన్చార్జ్ డా. పి.ఆర్.కె ప్రసాదు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ 'కోఆర్డినేటర్ ఫిరోజ్ పాల్గొన్నారు.

## పిడుగు పడి గేదె మృతి

**విశాలాంధ్ర - వెలిగండ్ల :** వెలిగండ్ల లోని ఎస్సీ కాలనీలో మంగళ వారం రాత్రి 8 గంటల సమయంలో ఉరు ములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఎస్సీ కాలనీకి చెందిన కు మ్మరకుంట. నవనీతమ్మకు చెందిన గేదె పిడుగు పడి మృతి చెందింది. రూ 70, 000లు నష్టం జరిగిందని తాము జీవనో పాధి కోల్పోయామని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వెటర్నరీ అసిస్టెంట్ కాజా రహమం తుల్లా సంఘటన స్థలానికి వచ్చి మృతి చెందిన గేదెను పరిశీలించి విషయాన్ని అధికారులకు తెలియజేశారు. నష్టపోయిన కుటుంబాన్ని ప్రభు త్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో విజేత స్వర్ణ

**విశాలాంధ్ర - సంతమాగు లూరు :** శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు సందర్భంగా కుందుర్రులోని మఠంపాలెం బజారు వారి ఆధ్వర్యంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి.బుధవారం కుందుర్రులో నిర్వాహకులు మోతాదుగారి మస్తాన్ వలి, ఖాజావలి, మహబూబ్ బాషా, పసుపులేటి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగాంజి నేతృత్వంలో ఎడ్ల పందేలు జరిగాయి. కారంచేడు మండలం అనిల్ కుమార్ ఎడ్ల జత 4600 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. జె.పంగులూరుకు చెందిన హబీబ్ ఎడ్లు 4500 అడుగులతో ద్వితీయ, కుందుర్రుకు చెందిన ఖాదర్ వలి ఎడ్ల జత 4300లతో తృతీయ స్థానాల్లో నిలిచాయి, కుందుర్రుకే చెందిన ఉప్పు సుబ్బారావు ఎడ్ల జత 4000 అడుగులతో నాల్గవ, మండుల మీరావలికి చెందిన ఎడ్లు 3900 అడుగులు లాగి ఐదవ స్థానంతో సరిపెట్టుకున్నాయి. ప్రథమ బహుమతి కింద రూ. 15116, ద్వితీయ రూ.10116, తృతీయ రూ.7116, నాల్గవ రూ.5116, ఐదవ రూ.3116 లను అందజేశారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL**
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

**O.A. No. 311 / 2025**

**Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**

**Between :**
INDIAN BANK, Ongole Branch,Ramakurivari Street, Santhapet, Ongole, Prakasam District, Rep. by its Chief Manager. ...APPLICANT
And
1.M/s. Hindustan Soaps and Salts Company, Rep. by its Proprietrix - Atmakuri Swapna,R/o. Plot No.B-11/A, Dr. No.12.444, Sy. No.102, APIIC Ind. Estate,Pernamitta, Ongole - 523001
2. Atmakuri Swapna, W/o.A. Sridhar,
3. Atmakuri Sridhar, S/o.A. Pundarikakshaiah
4. Atmakuri Pundarikakshaiah, S/o. Kotaiah,All 2,3,4 are R/o. Dr. No. 28-1-50, 1st Floor, South Street, Near Enugu Chettu, Ongole - 523001.
5.M/s.PADMA INDUSTRIES,Rep. by its Proprietrix - Innamuri Padma, R/o. Dr. No.2/62, Opp: Telephone Exchange, Main Road, Karedu Village,Ulavapadu Mandal, Prakasam Dist., - 523292.
6. Innamuri Padma,R/o. Dr. No.2/62, Opp: Telephone Exchange, Main Road, Karedu Village,Ulavapadu Mandal, Prakasam Dist., - 523292 ...DEFENDANTS

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act.1993 against you for the recovery of some mentioned therein together with current and future interest and other reliefs. You are here by summoned to appear and file Written statement before this tribunal at **10.30am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **21-05-2025** to answer the claim. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

**REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM**



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL**
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

**O.A. No. 289 / 2025**

**Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**

**Between :**
INDIAN BANK, Ongole Branch,Ramakurivari Street, Santhapet, Ongole, Prakasam District, Rep. by its Chief Manager. ...APPLICANT
And
1.M/s. Lalitha Industries, rep. by its Proprietrix - A. Lalitha Kumari,R/o.APPIC Industrial Estate, S.No.102, Flat No. 1, Shed A, Ganesh Temple Street, Kurnool Road, Ongole, Prakasam District - 523 001.
2. A. Lalitha Kumari,R/o. APPIC Industrial Estate, S.No.102, Flat No. 1, Shed A, Ganesh Temple Street, Kurnool Road, Ongole, Prakasam District -523 001. ... DEFENDANTS

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act.1993 against you for the recovery of some mentioned therein together with current and future interest and other reliefs. You are here by summoned to appear and file Written statement before this tribunal at **10.30am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **21-05-2025** to answer the claim. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

**REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM**



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL**
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

**O.A. No. 292 / 2025**

**Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**

**Between :**
INDIAN BANK, Ongole Branch,Ramakurivari Street, Santhapet, Ongole, Prakasam District, Rep. by its Chief Manager. ...APPLICANT
And
1.M/s. ARV Infrastructure and Logistics, rep. by its Proprietor - Battula Arun Kumar, R/o. Dr. No.5-181, Chintapallipadu Village, Yeddanapudi (Md), Prakasam District - 523 301.
2. Battula Arun Kumar,R/o.Dr.No.5-181, Chinta Pallipadu(V),Yeddanapudi(Md),Prakasam District - 523 301. ... DEFENDANTS

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act.1993 against you for the recovery of some mentioned therein together with current and future interest and other reliefs. You are here by summoned to appear and file Written statement before this tribunal at **10.30am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **21-05-2025** to answer the claim. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

**REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM**


# విపత్కర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ తుషార్

**విశాలాంధ్ర - బాపట్ల :** విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. మాక్ డ్రిల్ లో భాగంగా రైల్వే స్టేషన్ లో అగంతకులు దాడులకు పాల్పడుతున్నారనే సమాచారంతో పోలీస్ యంత్రాంగం ఇతర శాఖల అధికారులు సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చొని తనిఖీలు నిర్వహించారు. ఆగంతుకుల దాడులలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి ఆంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. దాడులు జరిగే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించు విధానం పై ప్రయాణికులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం భరత్ పాక్ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో శత్రుదేశాల ఆగంతకులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా అనుకోని ప్రదేశంలో ఆగంతకులు దాడులకు పాల్పడితే జిల్లాలోని అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగకుండా తీసుకోవలసిన చర్యల గురించి, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏవిధంగా అప్రమత్తంగా వ్యవహరించాలి అను విషయాల గురించి పౌరులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లాలోని బాపట్ల రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా, బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ రాంబాబు, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్.ఐ లు మౌలుద్దీన్, శ్రీకాంత్, రైల్వే, వైద్య, అగ్నిమాపక ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిండు గర్భిణి హత్య కేసులో నిందితురాలుకి జీవిత ఖైదు

**విశాలాంధ్ర - బాపట్ల :** నీళ్లు తీసుకుని రాకపోవటంతో అందరూ కలిసి నిండు గర్భిణిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితురాలికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ ఒంగోలు ఏడవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి టి.రాజవెంకటాద్రి తీర్పు ఇచ్చారు. 2015 సెప్టెంబర్ 13వ తేదీన లో బల్లికురవ మండలం కొప్పెరపాడుకు చెందిన సురభి శారమ్మను ఆమె భర్త చార్లెస్ అత్తమ్మ ఏసమ్మ, పున్నయ్య, లింగమ్మలు శారమ్మను ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకుని తీవ్రంగా దుర్భషలాడి ఆడబిడ్డ కిరోసిన్ పోయగా భర్త నిప్పు పెట్టాడు. దీంతో ఆమె భయటకు పరిగెత్తుకుంటూ వచ్చి నీళ్ల తొట్టిలో కూర్చోని బంధువులకు సమాచారం ఇవ్వగా ఆమెను అద్దంకి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసు ఘటనలో మృతురాలి అత్త ఏసుమ్మ, మామ పున్నయ్యలు మృతి చెందారు. భర్త చార్లెస్ బెయిల్‌పై బయటకు వచ్చి కనిపించకుండా పోయాడు. ఈ కేసులో ముద్దాయిగా ఉన్న మృతురాలి అడబిడ్డ లింగమ్మకు జీవితఖైదు జరిమాన విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నిందితురాలికి శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలీస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన సంతమాగులూరు సిఐ వెంకట రావు, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారిను జిల్లా ఎస్పీ తుషార్ దూడి ప్రత్యేకంగా అభినందించారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL**
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

**O.A. No. 312 / 2025**

**Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**

**Between :**
INDIAN BANK, Ongole Branch,Ramakurivari Street, Santhapet, Ongole, Prakasam District, Rep. by its Chief Manager. ...APPLICANT
And
1) M/s. Prime Way Transit, rep. by its Proprietor - Kommu Srikanth, R/o.Dr. No. 4-226-5, Venkate - swara Nagar, Ongole City, Ongole, Prakasam District-523 301.
2) Kommu Srikanth,R/o.Dr.No.4-226-5, Venkate -swara Nagar, Ongole City,Ongole, Prakasam District - 523 301. ... DEFENDANTS

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act.1993 against you for the recovery of some mentioned therein together with current and future interest and other reliefs. You are here by summoned to appear and file Written statement before this tribunal at **10.30am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **21-05-2025** to answer the claim. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

**REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM**



**బహిరంగ ప్రకటన**

నా క్లయింటు (ఉద్యోగ రీత్యా) తమిళనాడు, కోటూరు చెన్నై - 85, కరుణానిధి 1వ వీధి, 3/ఏ పాత నెంబరు, 5-కొత్త నెంబరు కాపురస్తులు చిత్తూరి వెంకట అనంద్ గారి భార్య **చిత్తూరి సాయికుమారి** గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట గుంటూరు జిల్లా, మంగళగిరి డి.నెం.307 నందు 369 చదరపు గజముల స్థలము కలదు. సదరాస్తి నా క్లయింటు పేరిటకు ది.25-04-2008న ఆమె భర్తగారైన చిత్తూరి వెంకట ఆనంద్ ద్వారా దఖలు దస్తావేజు నెం.3609/2008 రుగా మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడినది. కాగా, సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన విక్రయ దస్తావేజు నెం.**3800/1982** (మంగళగిరి యస్ఆర్ఓ) ఒరిజినల్ మరికొన్ని దస్తావేజులు తీసుకుని బాపట్ల టౌన్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చారు. అంతట సదరు దస్తావేజులు జిరాక్సు అవసరమై బాపట్ల టౌన్ సెంటర్‌కు ఆటోలో వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పైన పేర్కొన్న లింకు దస్తావేజు నెం. **3800/1982** జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ తెలియజేయగలరు. అలా తెలియజేసిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును.

సదరాస్తిపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరాలు, ఆక్షేవణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 15 రోజులలోగా తెలియజేయగలరని కోరడమైనది.

**సయ్యద్ ఆసిఫ్ అలీ, అడ్వకేట్, కొబాల్డ్‌పేట, గుంటూరు. సెల్ నెం. 93941 55522**

## దొంగలపై పోలీసులు నిఘా ఉంచండి

విశాలాంధ్ర - రేపల్లె : పంట పొలాల్లోని విద్యుత్ మోటార్ల వైర్లను అపహరించ కపోతున్న వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిపిఐ బృందం విజ్ఞప్తి చేసింది. భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాల్లోను, మాగాణి భూములలో పంటలకు భూగర్భ జలాలను అందించేందుకు రైతులు ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్లకు సంబంధించి వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించకపోతున్నారన్న విషయం తెలుసుకున్న సిపిఐ బృందం బుధవారం లంక భూముల్లోనూ మాగాణి భూముల్లో పర్యటించి విద్యుత్ మోటార్ల వైర్లు అపహరణకు గురైన తీరును పరిశీలించిన అనంతరం రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిపిఐ బృందం నాయకులు శ్రీనివాసరావు, గొట్టుముక్కల బాలాజీలు మాట్లాడుతూ గత మూడు నెలలుగా మోటార్ల వైర్లు అపహరణకు గురవుతున్నాయని దాదాపు 100 మోటార్లకు సంబంధించి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయినట్లు రైతులు తెలిపారని వారు చెప్పారు. విద్యుత్ మోటార్ల వైర్లను అపహరిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దోషులను శిక్షించి ఆర్థికంగా నష్ట పోతున్న రైతులను కాపాడాలని నాగాంజనేయులు, శ్రీనివాసరావు,బాలాజీలు కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు కొమ్మినేని శ్రీమన్నారాయణ,కొసరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి వర్ధంతి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ అపార ధైర్యశాలి అల్లూరి సీతారామరాజు అని చెప్పారు. అణగారిన వర్గాలు, గిరిజనుల సంక్షేమానికి ఆయన చేసిన పోరాటం మరవలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ అల్లూరి స్ఫూర్తితో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.రవిశంకర్,పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, స్రవంతి, బి.వీరాస్వామి, కృష్ణ శ్రీ,జూనియర్ అసిస్టెంట్ ఎ.రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే కుటుంబానికి అరుదైన గౌరవం

విశాలాంధ్ర - చీరాల : ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఒకే కుటుంబానికి అరుదైన గౌరవం దక్కింది.చీరాల రామనగర్‌కు చెందిన పాస్టర్ కిరణ్ కుమార్,ఆయన కుమార్తె ఏంజెల్ రే విన్నీ,చెల్లెళ్లు డాక్టర్ ఉషాకిరణ్,ప్రేమ కిరణ్,సత్య కిరణ్‌లకు ప్రతిష్టాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం లభించింది.విజయవాడకి చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ దండిగా ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 1న విజయవాడలో ప్రపంచస్థాయి సంగీత కార్యక్రమం నిర్వహించారు. అందులో 18 దేశాలకు చెందిన 1,046 మంది కీ బోర్డ్ ప్లేయర్స్ పాల్గొన్నారు. ఇందులో ఈ కుటుంబ సభ్యులంతా పాల్గొని వారి సత్తా చాటి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో పేర్లు ఎక్కేలా ఘనత సాధించారు.వీరిలో సత్యకిరణ్ మూగ,చెవుడు అయినప్పటికి,మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రతిభను చాటడం విశేషం.ఈ కుటుంబానికి ఆత్మీయ నాయకులు పాస్టర్ అయినా మద్దిరాల శామ్యూల్ 73 సంఎల వయస్సులో తన సత్తా చాటారు.వీరి ప్రతిభను గుర్తించి,ఏప్రిల్‌లో విజయవాడ మెట్రో పాలిటన్ మిషన్ చర్చిలో పాస్టర్ దండిగా అగస్టీన్,సిస్టర్ విజయకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్స్,మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్స్, ప్రముఖులు వీరిని అభినందించారు.

# మురుగుపారే దారేది...!

### కొమ్మాలపాడులో పారిశుద్ధ్యం అధ్వానం

- వీధుల్లో డ్రైనులేక పేరుకుపోయిన వ్యర్థాలు
- నామమాత్రంగా పూడికతీత పనులు
- అబ్దుల్లా బజారులో సొంతంగా మురికి గుంతలు ఏర్పాటు
- చోద్యం చూస్తున్న అధికారులు,పాలకులు
- సీపీఐ నేత ఖాదర బాషాతో గోడు వెలిబుచ్చిన మహిళలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఇరవై ఏళ్లకు పైగా ఇక్కడే ఉంటున్నాం. మా వీధుల్లో సైడు కాలువల్లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లలోని వాడకపు నీరు, వర్షాలు కురిసిన సందర్భాల్లో వరదనీరు రోడ్లపైన నిలిచి, రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఎండా, వాన కాలమన్న తేడా లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొంపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. గత్యంతరం లేక ప్రతి ఇంటి ముందుర ఇంకుడు గుంతలు వలే మురికి గుంతలు ఏర్పాటు చేసుకున్నాం అని కొమ్మాలపాడులోని మహిళలు కొందరు తమ బాధను వ్యక్తం చేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. గ్రామంలో ప్రధాన వీధుల్లోని సైడు కాలువలు వ్యర్థాలతో నిండిపో యాయి. కొన్నిచోట్ల చెత్తా చెదారం, బురద పేరుకు పోయి మురుగు నీరు సీసీ రోడ్లుపైకి పారుతోంది. మరికొన్ని చోట్ల కాలువలు దుస్థితికి చేర దంతో ఇళ్ల ముందే మురికి కూపాలకు నిలయంగా మారింది. దీంతో ప్రజలు నడవ డానికి, వాహనాల రాకపోకల సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా కెనరా బ్యాంకు స్ట్రీట్, శెట్టి గారి బజార్(పఠాన్ ఖాదర్ వలి) అబ్దుల్లా వీధుల్లో అధ్వానంగా మారాయి.

**- గుంతలు నిండి రోడ్లపైకి మురుగు :**

జాగర్లమూడి అబ్దుల్లాటీ కొట్టు మౌలాలి వీధుల్లో సీసీ రోడ్డు వేశారు. కానీ,సైడు కాలువలు నిర్మాణం చేపట్టలేదు.దీంతో ప్రతి ఇంటి ముందుర ఇంకుడు కుంటలు వలే మురుగునీరు నిల్వ చేసే గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాదు నిత్యం పిల్లలు తిరిగే ప్రాంతం కావడంతో వాటపైన మూతలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం అవి కూడా నిండిపోయి రోడ్లపైకి మురుగునీరు చేరుతోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

**- ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం**

గ్రామంలో ఉన్న చిరు తినుబండారాలు,టీ దుకాణాలు నుంచి పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన వ్యర్థాలను ప్రధాన రహదారి పక్కనే పడవేస్తున్నారు. దీంతో అక్కడ అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. అలాగే సైడు కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగు పారే దారిలేక దుర్గంధం వెదజల్లుతోంది.దోమలకు ఆవాసంగా మారడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు లేకపోలేదని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**- నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు**

గ్రామానికి వచ్చిన సందర్భాల్లో మాత్రమే ఆగమేఘాల మీద అప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు, కొత్తగా సైడు కాలువల నిర్మాణం చేపట్టడం లేదని చెబుతున్నారు.

**వెంటనే పూడికతీత పనులు చేపట్టాలి**

**- సంతమాగులూరు మండల సమితి సీపీఐ సహాయ కార్యదర్శి షేక్.ఖాదర్ బాషా**

కొమ్మాలపాడు అంతర్గత వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి, వెంటనే పారి శుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజల పక్షాన సీపీఐ పార్టీ డిమాండ్ చేస్తున్నాం. పూడికతీత, నూతన సైడు కాలువల నిర్మాణానికి చొరవ చూపాలని పాలకులు, సంబంధిత అధికారులను కోరుతు న్నాం. దీనిపై చర్యలు తీసుకోకపోతే మహిళలతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వం నిధులు మంజూరు అభినందనీయం

**- నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు**

విశాలాంధ్ర - పర్చూరు : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు భూ సేకరణ కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించుటకు భూసేకరణ కోసం రూ75.11 కోట్లు కేటాయించడంపై నల్లమడ రైతు సంఘం తరపున ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. నిధుల విడుదలకు కృషి చేసిన పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. పర్చూరు వరకు కాలువను పొడిగించేందుకు మొత్తం 441 ఎకరాల భూమి అవసర మవు తుందని, దీనికి రూ.113.39 కోట్లు అవసరం అవుతుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కేటాయించిన రూ.75.11 కోట్లకు తోడు ఇంకా మిగిలిన రూ.38.28 కోట్లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయమని నల్లమడ రైతు సంఘం విజ్ఞప్తి చేస్తున్నదన్నారు.గతంలో ఇచ్చిన భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్ కాలపరిమితి ముగియడంతో,తాజాగా భూసేకరణ ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామ న్నారు.త్వరితగతిన నూతన నోటిఫికేషన్ విడుదల చేసి,భూసేకరణ పూర్తిచేసి, కాంట్రాక్టర్‌కు భూమిని అప్పగించి పనులు ప్రారంభించి తద్వారా కృష్ణా జలాలు పర్చూరు వరకు ప్రవహింపజేసి రైతుల పొలాల్లోకి నీరు చేరేలా చేయాలని ప్రభు త్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని రాజమోహనరావు తెలిపారు.

## ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : దేవాలయాల్లో ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని దేవస్థానముల కార్య నిర్వహణ అధికారి జి.నరసింహమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవస్థానం,శ్రీ చెన్నకేశవస్వామి వారి దేవస్థానం, శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవస్థానములకు సంబం ధించిన ధర్మకర్తల మండలి నియామకపు నోటిఫికేషన్‌ను దేవదాయ, ధర్మ దాయ శాఖ ఏపీ విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం బుధవారం నుండి ఈ నెల 26 తేది లోపు ఆసక్తి గలవారు దేవదాయ శాఖ నియమ నిబంధనలనుసరించి తమ దరఖాస్తులను జిల్లా దేవాదాయ శాఖ అధికారి బాపట్ల వారికి ఈనెల 26వ తారీకులోపు దరఖాస్తులను అందజేయాలని దేవస్థాన ముల కార్యనిర్వహణ అధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

# సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల : కార్మికులని బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు కోరకు మే 20న సమ్మె జయప్రదం కోసం కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి సదస్సు బాపట్లలో అంబేద్కర్ భవన్‌లో జరిగినా ఉమ్మడి సదస్సుకి ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింగం. వాణిశ్రీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్. మణి లాల్, ఐఎఫ్టియు నాయకులు ఎస్డి హాబీల అధ్య క్షత వహించారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తన్నీరు సింగరకొండ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధన లక్ష్మి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్యామేలు, ఐఎఫ్టియు నాయకులు మేకల ప్రసాద్‌లు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై ఉమ్మడిగా తిప్పికొడదామన్నారు.కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేయాలని జాతీయ ప్రయోజ నాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలి, ధరల పెరుగుదలకు పరిహారంతో పాటు 5 సంవత్సరాలకొసారి కనీసవేతనాల సవరణ చేయాల న్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేత నాలు, సామాజిక భద్రత, సుప్రీం కోర్టు తీర్పు గ్రాట్యుటీ అమలు చేయాలని రైతులుకి మద్దతు ధర కల్పించాలని కోరుతూ జరిగే మే 20 సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయా లని ఉమ్మడిగా పిలుపు ఇచ్చారు. ఉమ్మడి సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందార్, ఐఎఫ్టియూ కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి నాయకులు కె.శరత్ బాబు, లక్ష్మణ్, కే. వసంతరావు తదితరులు పాల్గొన్నారు.